# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 12-02-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ వైద్యులకు ఆసుపత్రుల అభివృద్ధి ఎంత ముఖ్యమో సమాజ సేవ కూడా అంతే ముఖ్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- ❖ ప్రస్తుతం విజృంభిస్తున్న వైరస్ పట్ల కోళ్ళ ఫారాల రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నందిగామ డివిజన్ పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ మోజెస్ వెస్లీ తెలిపారు.
- ❖ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 2025-26 వార్షిక బడ్జెట్‌పై ఈరోజు సమీక్ష నిర్వహించారు.
- ❖ అసంఘటిత రంగ కార్మికులందరనీ ఈ-శ్రమ్ పోర్టల్ లో నమోదు చేయాలని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు.

===========================

వైద్యులకు ఆసుపత్రుల అభివృద్ధి ఎంత ముఖ్యమో.. సమాజ సేవ కూడా అంతే ముఖ్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. గుంటూరులో కిమ్స్ శిఖర ఆసుపత్రి ప్రారంభోత్సవానికి ఈరోజు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మెడికల్ బిల్లులతో పేద కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని.. వైద్య ఖర్చులు తగ్గాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇప్పటికే వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అనేక ప్రభుత్వ సేవలు అందిస్తున్నామని, భవిష్యత్తులో ప్రైవేటు సేవలు అనుసంధానంపై కూడా దృష్టి పెడతామన్నారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం కోసం పని చేస్తున్నామని చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ...

(వాయిస్ 36 సెకన్లు)

===========================

ఆపత్కాల సమయంలో వలస కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలానే ఉద్దేశ్యంతో ఈ-శ్రమ్ పోర్టల్ ను ప్రవేశపెట్టడం జరిగిందని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఈరోజు

భీమవరం నుండి కలెక్టర్ నాగరాణి ఈ-శ్రమ్ పోర్టల్ లో కార్మికుల నమోదు, కార్మిక బోర్డు సభ్యత్వ నమోదు, భవన నిర్మాణాలపై ఒక శాతం సెస్ వివరాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అంశాలపై దృశ్య శ్రవణ మాధ్యమం ద్వారా కార్మిక శాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్ లు, ఎంపీడీవోలతో సమీక్ష నిర్వహించారు. అసంఘటిత రంగ కార్మికుల ప్రయోజనాలు కాపాడేందుకు ఈ-శ్రమ్ పోర్టల్ లో కార్మికులను నమోదు చేయాలని కలెక్టర్ తెలియజేశారు.

==========================

ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలంలో అంతు చిక్కని వైరస్ తో 15 వేలకు పైగా కోళ్లు మృతి చెందడంతో అప్రమత్తమైన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖ అధికారులతో రాష్ట్ర సరిహద్దుల్లో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసారు. కోళ్ల వాహనాలను ఇరు రాష్ట్ర సరిహద్దుల్లో అనుమతించకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. నందిగామ డివిజన్ పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ మోజెస్ వెస్లీ డివిజన్ పరిధిలోని జొన్నలగడ్డ, శివాపురం, వత్సవాయి తాళ్లూరు గ్రామాల సరిహద్దుల్లో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. నందిగామ పరిధిలోని వివిధ గ్రామాల్లో ఉన్నటువంటి కోళ్ల ఫారాలను సందర్శించి యాజమాన్యానికి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర చెక్ పోస్ట్ ల వద్ద పోలీసులతో పాటు పశువైద్యులను కూడా పర్యవేక్షణలో ఉంచామని ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ...

(వాయిస్ 27 సెకన్లు)

==========================

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్‌పై సమీక్ష నిర్వహించారు. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో జరిగిన ఈ సమీక్షా సమావేశంలో ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈనెల 28వ తేదీన అసెంబ్లిలో 2025-26 వార్షిక బడ్జెట్ ను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. ఈ నేపథ్యంలో వివిధ పథకాలకు అవసరమయ్యే బడ్జెట్ కేటాయింపులపై అధికారులతో చర్చించారు. కాగా ఈ నెల 24 నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయి.

==========================

మాఘ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ రోజు రాష్ట్ర వ్యాప్తంగా భక్తులు సముద్ర నదీ తీరప్రాంతాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశాఖ జిల్లాలోని భీమునిపట్నం గోస్తని సాగరసంగమం వద్ద భక్తులు పెద్దఎత్తున పుణ్యస్నానాలను ఆచరించారు. దూరప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు సముద్ర స్నానాలు చేసి సూర్యభగవానునికి పూజలు చేశారు. భక్తుల రద్దీ దృష్ట్యా జీవీఎంసీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. భీమునిపట్నం సీఐ సుధాకర్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

విరామం

==========================

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సిఫీ టెక్నాలజీస్ చైర్మన్ రాజు వేగేశ్న ను రాష్ట్ర ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ ఆహ్వానించారు. ఉండవల్లి నివాసంలో మంత్రి నారా లోకేష్ ను సిఫీ టెక్నాలజీస్ చైర్మన్ కలిశారు. ఈ సందర్భంగా రాజు వేగేశ్న మాట్లాడుతూ.... సిఫీ టెక్నాలజీస్ సంస్థ దేశంలో ఫార్చ్యూన్ 500 కంపెనీల్లో ఒక్కటిగా ఉందని, దేశంలోని వివిధ నగరాల్లో ఉన్న అనేక వాణిజ్య సంస్థలు, బ్యాంకులతో సహా నార్త్ అమెరికా, ఇంగ్లాండ్ సింగపూర్ లోని వివిధ కంపెనీలకు సిఫీ డేటా సర్వీసెస్ అందిస్తోందని మంత్రి లోకేష్ కు వివరించారు. కంపెనీ విస్తరణ ప్రణాళికల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ లో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాల గురించి, విశాఖపట్నం లో మెగా డేటా సెంటర్, కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ ఏర్పాటుపై ఆయన మంత్రి నారా లోకేష్ తో చర్చించామన్నారు. ఆంధ్రప్రదేశ్ లో పెట్టుబడులు పెట్టేందుకు ప్రస్తుతం ఉన్న అవకాశాలు, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో భాగంగా ప్రభుత్వం అందిస్తున్న సేవలు, నూతనంగా తీసుకొచ్చిన ఐటీ పాలసీల గురించి నారా లోకేష్ ఆయనకు వివరించారు.

===========================

పవిత్ర రంజాన్ మాసం నేపథ్యంలో ముస్లిం ప్రభుత్వ ఉద్యోగులు తమ కార్యకలాపాలను ఒక గంట ముందు ముగించుకుని కార్యాలయాల నుండి వెళ్లడానికి అనుమతినిస్తూ.. ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రధాన కార్యదర్శి ముకేష్ కుమార్ మీనా ఒక ప్రకటన విడుదల చేస్తూ... మార్చి 2వ తేదీన ప్రారంభం కానున్న రంజాన్ మాసంలో పూజలు నిర్వహించుకునేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నామని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

===========================

విజయనగరం జిల్లాలోని ప్రధాన రహదారులపై సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ అధికారులను ఆదేశించారు. అన్ని మండల కేంద్రాలు, మున్సిపాలిటీలు, మేజర్ పంచాయతీలు, జాతీయ రహదారిపై ముందుగా వీటిని ఏర్పాటు చేయాలని సూచించారు. హిట్ అండ్ రన్ జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీ సమావేశం కలెక్టర్ ఛాంబర్‌లో ఈరోజు ఆయన అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రమాదాల నివారణపై ముందుగా దృష్టి సారించాల్సి ఉందన్నారు. దీని కోసం డ్రైవింగ్ లైసెన్స్ ల జారీ నిబంధలను కఠినతరం చేయడం, ప్రమాద కారకుల లైసెన్సులను నిలుపుదల చేయడం, రహదారి నియమాలపై అవగాహన కల్పించడం తదితర చర్యలను చేపట్టాలని సూచించారు.

===========================

దక్షిణ భారతదేశ ఆలయాలను ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ సందర్శిస్తున్నారు. ఈరోజు ఉదయం కేరళలోని చొట్టనిక్కరలో శ్రీ అగస్త్య మహర్షి ఆలయానికి చేరుకున్నారు. కేరళ సంప్రదాయంతో ఆలయ పండితులు పవన్ కళ్యాణ్ కు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం శ్రీ అగస్త్య మహర్షి వారికి ఉప ముఖ్యమంత్రి సంప్రదాయబద్ధంగా మొక్కులు చెల్లించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ ఆవరణలో ఉన్న ఇతర మహా ఋషుల ఆలయాలను దర్శించుకున్నారు.

===========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 119వ సంచిక ఈనెల 23వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 21వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

===========================

పోషకాహార లోపం ఉన్న చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటిడిఏ ఇన్‌ఛార్జ్ ప్రాజెక్ట్ ఆఫీసర్, సంయుక్త కలెక్టర్ ఎం. జె. అభిషేక్ గౌడ అధికారులను ఆదేశించారు. ఐటిడిఏ కార్యాలయంలో ఈరోజు ఆయన 11 మండలాల సిడిపిఓలతో అంగన్వాడీ సేవలపై సమావేశం నిర్వహించారు.

===========================
===========================